# అనుమానం పెనుభూతం



*వినయతి సుదృశో దృశోః పరాగం*
*ప్రణయిని కే సుమమానవానిలేన*
*తదిహిత యువతేర భీక్షమక్ష్కోర్ద్వ*
*యమపి రోష రోజోభిరావేసూరే*

***భావం:*** ప్రియుడు సుముఖి యొక్క కన్నుల నుంచి పుప్పొడిని నోటి ఊపిరితో ఊది తొలగిస్తూ ఉండడం చూసి అసూయపడ్డ ఆ యౌవనవతి కళ్ళు రెండూ రోషమనే పరాగంతో నిండిపోయాయి.

ఆ భార్యాభర్తలిద్దరిదీ కొంతవరకూ అనుకూల దాంపత్యమే. అతడామెకు ఏ లోటు చెయ్యలేదు. ఆమె కూడా అతడికి ఏ లోపమూ

జరపలేదు. కానీ భర్త చాలా అందగాడవడం వల్లనూ, తానంత సౌందర్యవతి కానందువల్లనూ  మనస్సులో అనుమానం ఆమెను ఎల్లప్పుడూ బాధిస్తూండేది. ఇంతటి సుందరాగుణ్ణీ ఇంకొక స్త్రీ వలచి, వలపించుకోకుండా ఉంటుందా? అని ఆమె ఎప్పుడూ అనుకునేది.

ఒకసారి వాళ్ళ ఇంటికి అతని మేనమామ కూతురు వచ్చింది. ఆమెకింకా వివాహం కాలేదు. భర్త “ మా మేనమామ కూతురు సుముఖి” అని పరిచయం చేసాడు.

పేరుకు తగ్గట్టు గానే ముఖం అందంగా ఉందనుకుంది భార్య. సుముఖి స్నానానికి వెళ్ళినప్పుడు “ మీరు సుముఖిని పెళ్ళి చేసుకోలేదేం” అని అడిగింది. అతడు ఆశ్చర్యంగా అదేం ప్రశ్న అన్నట్లు చూశాడు.

“మామూలుగా అందరూ మేనరికం చేసుకుంటారు కదా అందునా పైగా సుముఖి

అందెకత్తె కూడా. ఆమెను కాకుండా నన్ను చేసుకున్నారేం” అంది.

“ ఏమో నిన్ను చేసుకోవాలనిపించింది. చేసుకున్నాను”.

“అంతేనా లేక మీరిద్దరూ ఇష్టపడ్డా  మీ పెద్దవాళ్ళు ఒప్పుకోలేదా?” అంది.“అనుమానం ముందుపుట్టి ఆడది తరువాత పుట్టిందంటారు అందుకే. పిచ్చి ఆలోచన్లు మానెయ్యి.” అన్నాడు భర్త.

అతిథి మర్యాదలలో భాగంగా భార్యాభర్తలిద్దరూ సుముఖిని ఆ ఊరి ఉద్యానవనానికి తీసుకెళ్ళారు. కొంతసేపు తిరిగాక భార్య చెట్టు కింద కూచుంది. అతడు మరదలికి మిగతావి చూపించడానికి ముందుకు తీసికెళ్ళాడు.

గాలి విపరీతంగా వీచింది. చెట్లూ తీగలూ ఊగిపోయాయి. పువ్వులోని పుప్పొడి సుముఖి కళ్ళల్లో పడి కళ్ళు మండాయి.

మరదలి కష్టం చూసిన అతను "కదలకుండా నిల్చో కళ్ళు ముయ్యకు" అని చెప్పి ఆమె ముఖానికి దగ్గరగా ముఖం పెట్టి చేతులతో ఆమె తల కదలకుండాపట్టుకుని కళ్ళల్లో పుప్పొడి పోవడానికై గాలిని ఊద సాగాడు.

చెట్టుకింద కూచున్న భార్య కళ్ళల్లో ఆ దృశ్యం పడింది. ఆమెకది ప్రణయంలా కన్పించింది. సుముఖి కళ్ళల్లో పుప్పొడి పోయిందో లేదో కానీ భార్య మనస్సు అసూయతో నిండి ఆమె కళ్లు రోషమనే పుప్పొడితో నిండాయి.

అనుమానంపెనుభూతమన్నారందుకే. ఇరవయ్యవ శతాబ్దిలో హాస్య రసచక్రవర్తి పి.జి.వోడ్‌హౌస్ నవలలో కూడా ఇటువంటి సంఘటన ఉందంటే మానవ ప్రకృతి ఎన్నటికీ మారదనుకోవచ్చు కదా.

******